# ★ ప్లానింగు కమిషను ★

కొడవటిగంటి కుటుంబరావు

కిందటివారం కాంగ్రెసు వర్కింగు కమిటీ వారు మన దేశానికి ప్లానింగు కమిషను ఏర్పాటు కావాలని తీర్మానించారు. దేశంలోని ఆర్థిక చిక్కులను సరిదిద్దటం, ప్రజావసరాలను అధికంగా ఉత్పత్తి చేయించటం, అందరికీ పని దొరికేటట్టు చూడటం, ప్రజల జీవనప్రమాణాలు హెచ్చించటం ప్లానింగు కమిషను ఆశయాలు.

కొన్ని నిర్ణయాలకు స్వతస్సిద్ధంగా గొప్ప విలువ ఉంటుంది. రష్యాలో విప్లవానంతరం ఆర్థికవ్యవస్థ నిర్దిష్టప్రణాళికలను ఆశ్రయించుకొని, క్రమాభివృద్ధి చెందిన విషయం ప్రపంచమంతటా గుర్తించబడిన నాటినుండీ "ప్లానింగు" అనేది "మంచిపనుల" జాబితాలో చేరిపోయింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం మరికొన్ని దేశాలు— తూర్పు యూరపు దేశాలు— "ప్లానింగు" విధానం అవలంబించాయి. మరి కొన్ని దేశాలు అప్పటికీ ఇప్పటికీ ప్లానింగును గురించి మాట్లాడీ, గుటకలు వేసీ, పగటి కలలు కనీ సంతృప్తి చెందుతున్నాయి. కారణం అది సులభసాధ్యం కాదు; దానికి షరతులూ, నిబంధనలూ ఉన్నాయి. వీటిని స్థూలంగా ముందు పరిశీలింతాం.

ఒక విషయం, కాంగ్రెసుకు "ప్లానింగు" అనే భావం ఇవాళ కొత్తగా వెలువడినది కాదు. 1938 లో కాంగ్రెసువారు ప్లానింగు కమిటీ ఒకటి ఏర్పాటుచేసి కొంతపని సాగించారు. అయితే అప్పటి కాంగ్రెసే ఇప్పటి కాంగ్రెసా? అన్న విషయంలో చాలామందికి సందేహం లేక పోలేదు. కనీసం ప్రొఫెసరు కే. టి. షా కాంగ్రెసు వర్గాలకు అప్పుడున్నంత సన్నిహితంగా ఇప్పుడు లేడు. 'సోషలిస్టు'' అనే పదంపట్ల అప్పటి కాంగ్రెసుకున్న ఆదరణ ఇప్పటి కాంగ్రెసుకు లేదనేది కూడా విదితమే. (లేకపోతే మన రిపబ్లికుకు సోషలిస్టు రిపబ్లిక అనే నామకరణం జరిగి ఉండును.

ఇప్పటి సోషలిస్టులు, ఈ కాంగ్రెసువారు నిజంగా "ప్లానింగు" సాగిస్తారని నమ్మలేకుండా ఉన్నారనేది కూడా పత్రికల వార్తలవల్ల విదితమవుతున్నది. ఈ సంశయమే ఇతర వర్గాలకు కూడా ఉండటం దురూహ్యం కాదు.

* * *

'ప్లానింగు" అంటే ఏమిటి? అది కొనసాగటానికి అవసరమైన కనీసపు అవకాశాలేవి?

ప్రతి దేశంలోనూ సహజ సంపద కొంత ఉంటుంది. దానిని అవసర వస్తువులుగా మార్చటానికి నిపుణులు కావాలి. సాధన సామగ్రి— యంత్రాలూ, ఫ్యాక్టరీలూ, రవాణా సౌకర్యాలూ, విద్యుచ్ఛక్తి వగైరా— కావాలి. దేశావసరాలు సవ్యంగానూ సమగ్రంగానూ, గడవాలంటే, ఏ తరగతి సరుకులు ఎంతెంత ఉత్పత్తి కావాలో అంచనాలు కట్టాలి. దేశావసరాలను గురించి ముందుగా తబిసీళ్లు సంపాదించాలి. తబిసీళ్లు దొరికి, అవసరాలు అంచనా కట్టబడినాక వాటి నిర్మాణానికి సాధన సంపత్తీ, నిపుణులూ, శ్రామికులూ నియోగించబడాలి.

సరుకుల ఉత్పత్తి బహుముఖాలు గలది. ఒక్కసారిగా నూరేళ్లకు సరిపడే సరుకులు ఉత్పత్తి కావు. దానికి కావలసిన యంత్రాలుండవు. వాటిని సృష్టించే నిపుణు లుండరు. ఆ కారణం చేత ఒక్క ప్రణాళికతో ఇండియావంటి వెనుకబడిఉన్న దేశాన్ని అమెరికాలాగ ముందుకొచ్చిన దేశంగా చేయడం అసంభవం. కనుక దేశంయొక్క ఆర్థికాభ్యుదయం అనేక ప్రణాళికల ఆధారంతో సర్వతోముఖాభివృద్ధి చెందుతూ పోవాలి. ఒకవంక నిపుణులు తయారుకావాలి. ఉత్పత్తి చేసే యంత్రాలూ, యంత్రాలు చేసే యంత్రాలూ, యంత్రాలు నడిపే విద్యుచ్ఛక్తి ఉత్పాదన చేసే ప్రాజెక్టులు వగైరాలూ, ముడి పదార్థాలను రవాణాచేసే రైళ్లూ, వాటికి సంబంధించిన కార్ఖానాలూ, కార్మికుల శ్రమ

శక్తిని పెంచే ఆహారమూ, వారి ఆరోగ్యాన్ని కాపాడే వైద్య సౌకర్యాలూ, వారి పనితనం పెంచే సాంకేతిక విద్యా-కళలూ తొంభైముఖాల అభివృద్ధి జరగటమే కాక. ప్లానింగుద్వారా ఇవి సాధ్యం కావాలి. ఇందులో ఏ ఒక అంశం ప్లానింగులో స్థానం సంపాదించలేకపోయినా ప్లానింగు పథకమంతా దెబ్బతింటుంది. ఉదాహరణకు మిగిలినవన్నీ అభివృద్ధి అయి వాటితోబాటు రైళ్ళ అభివృద్ధి కాకపోతే, ఎటువంటి పరిస్థితి ఏర్పడేదీ ఊహించవచ్చు. ముడిపదార్థాలను ఫ్యాక్టరీలకు అందించటానికి తగినన్ని రైళ్లు, రైలుమార్గాలు లేక ఫ్యాక్టరీలు నిలిచిపోతాయి, యంత్రాలాడిపోతాయి, కార్మికులకు పని ఉండదు, ఉత్పత్తి యంత్రమే స్తంభించిపోతుంది. ప్లానింగు—దేశంయొక్క ఉత్పత్తినిర్దిష్ట ప్రణాళికల ననుసరించి జరగటం-చాలా పెద్ద భారం. పైన చెప్పిన అంగాలన్నీ ఆ భారాన్నిలాగే గొలుసులో లింకులు. ఏ లింకు కాస్త బలహీనంగా ఉన్నా గొలుసు బలంలేనిదై పోతుంది. ఉత్పత్తి పెరుగుతున్న కొద్దీ ఈ గొలుసులో లింకులుకూడా బలపడాలి. ప్లానింగులోని అతి ముఖ్యవిషయం "దుర్బలమైన" లింకులు లేకుండా చూడటమే.

ఇదంతా ఆలోచిస్తే, ఎవరికైనా ఒక సందేహం కలిగితీరుతుంది. ప్లానింగు ఏగొలుసు లింకులనైతే బలపరచటానికి పూనుకుంటుందో ఆ లింకులమీద ప్లానింగు కమిషనుకూ, దాని వెనక ఉండే ప్రభుత్వానికీ పూర్తి పెత్తనం ఉండవద్దా? ప్రస్తుతం ప్లానింగు కమిషనును ఏర్పాటు చేయవలసినది భారత ప్రభుత్వం; దానిని నిర్వహించేది కాంగ్రెసుపార్టీ. కాంగ్రెసువారు నిర్వహించే భారత ప్రభుత్వానికి దేశంలో ఉండే ముడి పదార్థాలమీదా, వాటి స్థావరాలమీదా, దేశంలోఉన్న ఉత్పత్తి పరికరాలమీదా, ఇతర సాధన సామగ్రి మీదా, విద్యుచ్ఛక్తిమీదా, కార్మికులమీదా ఉన్న అధికారాలెటువంటివి? వీటిపై కాంగ్రెసుకుగాని, కాంగ్రెసు ప్రభుత్వానికిగాని ఉండే అధికారాలకు కల పరిమితి ఏమిటి? ఇది చాలా ముఖ్యమైన అంశం.

కాంగ్రెసు వర్కింగు కమిటీవారు శిఫార్సు చేసిన ప్లానింగు కమిషను నూతన రాజ్యాంగం క్రిందనే ఏర్పడబోతుంది కనుక ప్లానింగు కమిషను వెనక ఉండే ప్రభుత్వాధికారాలను నూతన రాజ్యాంగం ఏవిధంగా నిర్వచిస్తుందో చూడాలి. మన నూతన రాజ్యాంగంలో ఆస్తి హక్కులు విస్పష్టంగా నిర్వచించబడ్డాయి. ఎవరి ఆస్తిని కూడా "న్యాయమైన" పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అధికారాన్ని మన నూతన రాజ్యాంగం ఇవ్వదు.

ఈ కారణంచేత దేశంలో ఉన్న చిన్న పెద్ద పరిశ్రమలన్నీ సొంతదార్ల చేతిలోనే ఉంటాయి. పెట్టుబడి ధర్మాన్నిబట్టి వీరు ఈ పరిశ్రమలను లాభాలకొరకు మాత్రమే నడుపుతారు. కాంగ్రెసుమీది భక్తికొద్దీగాని, దేశక్షేమం కోరిగాని పెట్టుబడిదార్లు తమ పరిశ్రమలను ప్రభుత్వపరం చేస్తారనే ఆశ ఏమైనా ఉండేటట్టయితే, ఆ ఆశకు అవకాశం లేకుండా అప్పుడే బొంబాయి వ్యాపారస్థులు ప్లానింగు కమిషను ఆలోచనమీద "చన్నీళ్లు" చల్లారు.

ఎవరి ఆస్తులపై వారికి పూర్తిహక్కులుంటూ పరిశ్రమలు లాభాల కొరకే నడుస్తూనే ప్లానింగు అమలు జరగటం సాధ్యంకాదా అని ఎవరికీ సందేహం కలగవసరం లేదు. పెట్టుబడిదార్ల లాభాలకూ దేశావసరాలకూ ఎప్పుడూ పొంతన ఉండదు. దేశావసరాలు పెట్టుబడిదార్ల లాభాలను ఖాతరు చెయ్యనట్టే, పెట్టుబడిదార్ల లాభాలు దేశావసరాలను కూడా ఖాతరు చెయ్యవు. దీన్ని ఋజువు చెయ్యటానికి మన సమీపంలోనే ఎన్ని ఉదాహరణలైనా లభిస్తాయి. తాతా కంపెనీవారు తమ లాభాలు తక్కువగా ఉన్నాయని, ఒకవంక ఉక్కు అవసరం ఎంతో హెచ్చుగా ఉండగానే, 1946 నుంచి 1948 వరకూ ఉక్కు ఉత్పత్తి క్రమంగా తగ్గిస్తూరావటమే కాక, ఇంకా తగ్గిస్తామని కూడా చెప్పారు. పంచదార పారిశ్రామికులు ఇవేఎత్తులు వేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ప్రజల జీవితప్రమాణం ఏమాత్రమూ హెచ్చుకాకుండానే ఇతర దేశాల అవసరాలను ఆసరా చేసుకుని అక్కడి గోధుమల ధర నూటికి 40 వంతులు పెంచబడింది! అవసరాన్ని గుర్తించి లాభాలు పెంచటం వ్యాపారరీత్యా చాలా మంచిపని

కూడాను! అయితే అది ప్లానింగుకు అనుకూలించే ఆచారంమటుకు కాదు.

ఇట్లా కానిపక్షంలో అన్ని పెట్టుబడి దేశాలూ ప్లానింగు పద్ధతి అవలంబించే ఉండును. అచ్చగా సోషలిస్టు ఆర్థిక విధానాన్ని అవలంబించిన దేశాలు మాత్రమే ప్లానింగు అమలు చేయటంలో ఉన్న రహస్యం ఇదే. భారత రిపబ్లికును "సోషలిస్టు" రిపబ్లికు అనలేని కాంగ్రెసువారు గాని, నిన్న మొన్నటివరకూ పెట్టుబడిదార్ల కాళ్ళావేళ్ళా పడుతూ, ఉత్పత్తి పెంచండని ప్రాధేయపడుతున్న భారతప్రభుత్వంగాని ఇంతలో "సోషలిజం" అవలంబించిందని అశోకమెహతా మొదలైన సోషలిస్టు నాయకులు నమ్మలేకపోతే దానికి వారినెవరూ తప్పు పట్టరాదు. పెట్టుబడిదారీ సంస్కృతికి గర్భశత్రువైన సంస్థానాధీశులకు బురఖాలు కప్పటమూ, ముఖ్యపరిశ్రమలను జాతీయం చేసే ఉద్యమాన్నికూడా గడువు లేకుండా వాయిదా వెయ్యటమూ చేసిన కాంగ్రెసుసంస్థ వీటన్నింటినీ తలదన్నే ప్లానింగు విధానాన్ని అనుసరించ నిర్ణయించిందంటే నమ్మలేని వారంతా పూర్తిగా క్షంతవ్యులే.

బొంబాయి వ్యాపారస్థులు కాంగ్రెసు వర్కింగు కమిటీ నిర్ణయాన్ని గురించి చేసిన వ్యాఖ్యానాలలో కనీసం ఒక్కటి అతివిచిత్రంగా ఉన్నది. 'కాంగ్రెసు ప్రభుత్వంవారు ధనికవర్గం వారివద్ద కోల్పోయిన గౌరవ ప్రతిష్ఠలను కొంతవరకూ తిరిగి రాబట్టుకోగలందులకు ప్లానింగు కమీషనును ఏర్పాటుచేస్తూ ఉండిఉండవచ్చు." అని ఒకరన్నారు. ఈమాట రెండు విషయాలను రుజువు చేస్తున్నది. మొదటి సంగతి, ప్లానింగు కమిషనువారు తయారుచేసే ఆర్థిక ప్రణాళికలు పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా ఉంటాయని పైమాట అన్నవారు విశ్వసిస్తున్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికన్నా ధనికవర్గంవారి గౌరవాన్ని పోగొట్టుకో గలదనే ధ్వనికూడా ఇందులో ఉన్నది.

ప్లానింగుకు నిజంగా అవసరమైనది ప్రజల సహకారం. మొదటి దశలో అది ప్రజలను అగ్ని పరీక్షకు పెడుతుంది. ప్రజలూ, ముఖ్యంగా కార్మికవర్గమూ, తమ చెమట ధారపోసి, కడుపులు సహితం మాడ్చుకుని ఈ దశలో ఉత్పాదన సరుకులు ఉత్పత్తి చేస్తారు. ఆ సరుకులు ఉమ్మడిగా తమకు చెందుతాయనే విశ్వాసమే, వాటిద్వారా తమ అవసరాలు ముందు ముందు బాగా తీరుతాయనే ఆశే, వారికి ప్రేరణా ధైర్యమూ ఇస్తుంది. తాము సాముదాయిక శ్రమతో తయారుచేసే ఈ దోహదమంతా, ఈ యంత్రాలన్నీ ధనికవర్గం స్వంతం కాబోతాయనే అనుమానం ఏమాత్రం ఉన్నా శ్రామికులు ఈ కష్టాలకు ఒప్పుకోరు. ఈ త్యాగం చెయ్యరు. అందుచేత బొంబాయి వ్యాపారస్థులు ఊహించే ప్లానింగును నిజంగానే కాంగ్రెసువారు అమలు చేసే పక్షంలో ప్రజలకు, ముఖ్యంగా శ్రామిక వర్గానికి, అంతకంటె ద్రోహమూ అపచారమూ ఉండబోదు. ఈ సంగతి శ్రామికవర్గం ఊహించలేనిది కాదు. జాతీయ ట్రేడు యూనియను స్థాపనలో కార్మికవర్గానికి తాత్వికంగా కొంత ద్రోహం చేసిన కాంగ్రెసుసంస్థను కార్మిక వర్గాలు విశ్వసించలేకపోతే ఆశ్చర్యం లేదు. కనుక కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పరచబోయే ప్లానింగు కమిషనును కార్మిక వర్గాలు చాలా అనుమానంతో చూడగలరు. ఒకవంక పెట్టుబడిదారుల అనుమానానికీ, మరోవంక కార్మికుల అనుమానానికీ గురి అవుతూ ప్లానింగు కమిషను ఎవరి సహకారంతో పనిప్రారంభిస్తుందో చూడవలసి ఉన్నది. కాంగ్రెసు ప్రభుత్వంవారు ప్లానింగు కమిషనును ఏర్పాటు చేసేటందుకై శాసనం ప్రతిపాదించే సమయంలో జరిగే చర్యలవల్ల ఈ కమిషను పెట్టుబడిదార్లనే అణచి వేస్తుందో, శ్రామికులనే అణచి వేస్తుందో స్పష్టంగా తెలిసిపోతుంది. కాంగ్రెసు వర్కింగు కమిటీ చేసిన తీర్మానంలో వ్యక్తమైన ఆశయాలు ఉదారంగా ఉన్నవన్న సంతోషాన్ని, కాంగ్రెసు ఆశయాలకూ చర్యలకూ మధ్య వికసిస్తూ వస్తున్న అఖాతం మింగేస్తున్నది.

---

అసలు నువ్వు సమాధానం చెప్పవలసిన పెద్ద ప్రశ్న నువ్వు ఓడిపోయావా, లేదా అనికాదు. ఓడిపోతే, అంతటితో సంతుష్టి చెందావా?

# 1900 అర్ధ-శతాబ్దం 1950

మన దేశం 1900లో ఎలా ఉండేది?

ఆ కాలపు పరిపాలనా విధానమూ, అప్పుడధికారు లనుభవించిన అఖండ గౌరవమూ మన మెరుగుదుం. వైస్రాయిపదవిచుట్టూ ఎంత వైభవం చిగిర్చిందో స్వదేశ సంస్థానాలకు అతిథిగా వైస్రాయి వెళ్ళినప్పుడు చక్కగా వెల్లడి అయ్యేది. బ్రిటిష్ పరిపాలనలో మనకు ప్రధానంగా లభ్యమైన శాంతిభద్రతలకు స్థానిక చిహ్నాలుగా కనిపించే జిల్లా అధికారులకు ఎంత సామంతమైనా చెల్లేది. శాంతి భద్రతల మాటకు వస్తే, అంతకు ముందెప్పుడూ లేనంతగా మన దేశంలో అదుపూ, ఆజ్ఞా, వ్యాపించినై. కొద్ది మందిలో మాత్రం అసంతృప్తి రేకెత్తింది. అప్పుడే బెంగాల్ రాష్ట్రంలో టెర్రరిస్టు ఉద్యమం ప్రారంభ మయింది. అంతకంటె హెచ్చుగా ప్రజల్ని మహారాష్ట్రంలో తిలక్ సాగిస్తున్న విప్లవోద్యమం ఆకర్షించింది. అప్పట్లోనే బ్రిటన్ మనల్ని ఆర్థికంగా ఎలా దోచుకుంటోందో గోఖలే, రనడే ప్రభృతులు ప్రచారం చెయ్యడం మొదలుపెట్టారు. 1885లో స్థాపితమైన జాతీయ కాంగ్రెస్ సంస్థ ఈ పదమూడేళ్ళలోనూ క్రమంగా తన ఉనికిని నలుగురికీ స్ఫురింప జేసింది. అయితే అప్పట్లో మధ్యతరగతిలో ఒక చిన్నభాగం మాత్రమే కాంగ్రెస్‌లో ఉంది. సామాన్య ప్రజలంతా నిశ్చితంగా ప్రభుత్వం పక్షాన్నే ఉన్నారు. ప్రభుత్వానికి సంపూర్ణమైన అధికారం ఉండేది. అలా అఖండమైన అధికారంలో ఉండే ప్రాభవమంతా అప్పటి వైస్రాయి కర్జన్ ప్రభువులో ప్రతిఫలించేది.

అయితే అప్పటి పరిపాలన ప్రజల కష్టసుఖాలకు విముఖమయింది కాదు. కర్జన్ ప్రభువు కాలంలోనే 1094లో సహకారోద్యమం ప్రారంభమయింది. అప్పుడే వ్యవసాయ శాఖలు కూడా ఏర్పడినై. పైగా కర్జన్ హయాములోనే పురాతన వస్తుసేకరణ శాఖ స్థాపితమైంది. మన ప్రాచీన శిల్ప సంపదపట్ల ఆసక్తి కలిగింది. అయితే ఈ శాఖలన్నీ 1900 తరువాత ఏర్పడినై కనుక, అప్పట్లో ఇవేవీ లేవన్నమాట. పైగా, ఉమ్మడి పెట్టుబడితో నడిచే కంపెనీలలో చెల్లించబడు మూలధనం ఈనాడు 554 కోట్ల రూపాయలు; అప్పుడేమో 36 కోట్లే. బట్టల మిల్లులు 192, జనపనారమిల్లులు 36 ఉండేవి. కాని, మొత్తం బ్రిటిష్ ఇండియా అంతటా కలిపి 1900-01 సం॥లో 1366 కంపెనీలే ఉన్నై. ఇక ఉద్యోగాల మాటకువస్తే ఇప్పటి సంఖ్యలో ఐదవ వంతు మాత్రమే కనిపిస్తుంది. బొంబాయిలోనూ, అహమ్మదాబాదులోనూ ఉన్న బట్టల మిల్లులలో 1901లో 1,74,000 మందికీ, జనపనార మిల్లులలో 1,11,000 మందికీ పని ఉండేది. 21,000 కార్మికులతో సాగిన మైసూరు బంగారుపరిశ్రమను తప్పించి 20,000 మందికి పని చూపించిన పరిశ్రమ ఏదీ అప్పట్లో మనదేశంలో లేదు. ఉక్కు పరిశ్రమ ఆనవాలు తాతాకు అప్పుడే స్పష్టంగా కనిపించినా, అప్పటికింకా జంషెడ్‌పూరులో ఉక్కు పరిశ్రమకు పునాది పడలేదు. ఇక మిగిలిన చిన్న పరిశ్రమల్ని లెక్కిస్తే ఇనుమూ, రాగి ఫౌండ్రీలతో 13,000 మందీ, పెంకుల ఫ్యాక్టరీలలో 10,000 మందీ, అచ్చుఆఫీసులలో 13,000 మందీ, సిల్కు మిల్లులలో 14,000 మందీ, కాగితపు మిల్లులు తొమ్మిదింటిలోనూ కలిపి 5,000 మందీ పనిచేసేవారు. బొగ్గు ఏటా 70 లక్షల టన్నులుకూడా ఉత్పత్తి అయ్యేది కాదు. బొంబాయి, అహమ్మదాబాదు, కలకత్తా-ఈమూడు ప్రదేశాలలోతప్ప దేశంలో ఎక్కడా అప్పుడు పారిశ్రామిక చైతన్యమే లేదు.

అప్పట్లో అన్నింటికంటె రైల్వే శాఖ ముఖ్యంగా కనిపించేది. ఎందుచేతనంటే 1900-01లో 329 కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ దేశంలోని పరిశ్రమలన్నింటినీ అది మించింది.